
# 11

# ఊరేగింపులు

## ఆవుల పిచ్చయ్య



జై జై జై అనే శబ్దం గ్రామం వెలుపల తోట బావి మీద కూర్చుని మొఖం కడుగుచుండగా వినవచ్చింది. ఇంతలో గ్రామాల నుండి కొందరు ప్రజలు ఎర్రజండాలు తీసుకొని గ్రామంలో వెళ్ళుచుండగా చూచాను. నా హృదయం అతివేగంగా కలవరపడింది. ఒక క్షణమైనా ఆగలేక పోయాను. నోటిలో వున్న పండ్లపుల్లను తీసి నేలకుకొట్టి గ్రామంలోకి పరుగెత్తాను. కాని ఎవరో సాధ్యమైనంత తొందరలో తెలుసుకోవాలని ప్రయత్నించాను. గ్రామం చివరలోవున్న గొల్ల యువకుడైన గంగయ్య ఇంటికి వెళ్ళి చూచేసరికి ఎవ్వరూ లేరు. తొంబయి సంవత్సరముల వృద్ధురాలు మాత్రం ఉంది. చేతిలో కట్టె తీసుకొని బయటికి రావటానికి ప్రయత్నించుచున్నది. ''ఏమవ్వా గ్రామంలో ఏం జరుగుతుందని'' అడిగాను.

"ఇవ్వాళ మా అమరజీవి కొమరయ్య వీర మరణానికి ఊరేగింపు జరుగుతుంది. నేను అక్కడికే వెళ్ళుచున్నాను. నీవు కూడా రావయ్యా" అని చెప్పింది ఆ వృద్ధురాలు. ఇంతలో నా పొలంలో నాటు పెడుతున్న 20, 30 మంది స్త్రీలు నాట్లుపెట్టుట వదలి గ్రామంలోకి వచ్చారు, వారు అంతా గందరగోళంగా వున్నారని నా జీతగాడొచ్చి చెప్పగా వెంటనే పొలం దగ్గరకు వెళ్ళాను. పొలంలోఎవరూ లేరు. నీటిలో ఒరిగిన వారు దృశ్యం చూసేసరికి ఏదో విచారం వెళ్ళబుచ్చుచున్న ట్లుగా కనిపించింది. ఈ పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రాణత్యాగం చేసిన కొమరయ్య గురించి ఈ పొలం విచారపడుచున్నదని గ్రహించాను. ఇంతలో నా ప్రక్కనున్న పట్వారి పొలంలో నుంచి పెద్ద కేకల ధ్వని వినబడుట వలన అక్కడికి వెళ్ళి చూశాను. జీతగాండ్రు ఒకరికొకరు తొందర తొందరగా పిలుచుకొనుచున్నారు. వ్యవసాయకూలీల కొరకు కొమరయ్య ప్రాణాలర్పించి నందున ఈ వ్యవసాయ కూలీలు ఊరేగింపులో పాల్గొనటానికి తొందరపడు చున్నట్లు తెల్సుకొన్నాను.

అడవి పొలాలలో బావుల దగ్గిర ఎక్కడ కూడా ఒక మానవుడు లేడు. అంతా గ్రామం లోకి చేరుకొన్నారు. నా కాళ్ళు ఏమాత్రం నిలబడటం లేదు. నేను ఎటు అడుగు వేస్తామన్నా అడుగు లేవటంలేదు. గ్రామంవైపు మాత్రం అడుగుపడుతుంది. దారిలో వస్తూ ఉండగా గొర్రె లన్నీ గుంపులుగుంపులుగా వుండి ఇతర చెలకలవైపు వెళ్ళకుండా క్రిందికి తలలువేసి నిశ్శబ్దంగా నిలబడ్డవి. గొల్లవాండ్లు మాత్రం కావలి లేరు. వారు కూడా కొమరయ్యగారి ఊరేగింపులో పాల్గొనటానికి వెళ్ళినట్టు బోధపడింది. ముందు వెళ్ళి కాలువలో మొఖం కడుక్కొని వెళదా మనుకొన్నాను. కాలువ దగ్గరకు వెళ్ళేవరకు నీళ్ళు లేవు. బావి దగ్గరకు పోయాను. బావి మీద డొక్కలు గుంజుకపోయి ముందు గడ్డి వున్నా మేత మేయకుండా ఉన్న ఎడ్లను చూచి నాకు చాలా చిత్రమయినది. ఆలోచించాను. వేళగానివేళ ఎన్నడూ లేనివేళ అకస్మాత్తుగా మోటలు మీదనే విడచి రైతు గ్రామంలోకి పోయాడని ఎడ్లు విచారంతో నిలబడ్డాయని తెలుసుకొన్నాను.

అంబాయని ధ్వనులు ప్రక్కవైపు నుండి ఒకేసారి వినబడ్డాయి. అటు చూచేవరకు శరీరమంతా బురద జల్లుకొని నాగళ్ళు మెడపై వేసుకొని మోకాటి లోతున బురద పొలాలలో నిలబడ్డ ఎడ్లను చూశాను. ఏమాత్రం కదలకుండా విశ్రాంతి తీసుకొని నిలబడ్డట్టు కనిపించాయి. పిట్టల కీచుకీచుమనే శబ్దం వినబడటం లేదు. సన్నని మంచు కురుస్తోంది. ప్రపంచమంతా ఇవ్వాళ విచారం వెలిబుచ్చుతున్నట్లుగా కనిపించింది. కారుమబ్బులు పట్టాయి. మబ్బుల్లో తలదాచుకొన్న సూర్యుడు కనిపించటం లేదు. నా శరీరమంతా ఒకేసారి జలదరించింది. ఇక నిలబడలేకపోయాను. గ్రామంలోంచి నినాదాల ధ్వనులు వినిపిస్తున్నవి. ఈ అడవిలోని దృశ్యాలు నా హృదయాన్ని కలవరపెట్టుచున్నాయి. ముందు నడవటం ప్రారంభించాను. మెల్లమెల్లగా అడుగులు వేస్తుంటే నినాదాల ధ్వనులు ఎక్కువగా వినిపించుతుంటే, అంత వేగంగా నా అడుగులు పడుతున్నాయి. నేను ఎంత వేగంగా నడుచుచున్నానో నాకే తెలియదు. గ్రామంలోకి వెళ్ళాను. ప్రజలందరు ఆంధ్ర మహాసభ ఆఫీసుకి వెళ్ళినట్లు తెలిసింది. అయినను ఇంటివద్ద ఆడవాండ్లు ఉంటారనుకొన్నాను. ఇంటికి వెళ్ళేవరకూ ఎవ్వరూ కనబడలేదు. అతి వేగంగా

పొంగుచూ పొయ్యిలోని నిప్పులను చల్లార్చుచున్న పాలు చూచాను. ఒకవైపు అన్నం పళ్ళెంలో సగం మాత్రం కూరలతో కలిసియున్నది. కొమరయ్యగారి నినాదాలు వినబడగానే అన్నం తినుకొంటూ సగం అన్నం విడిచిపోయారని తెలుసుకొన్నాను. ఇంతలో ప్రక్క ఇంట్లో నుంచి ఏమో మాడుతున్నట్లు వాసన వచ్చింది. ప్రక్క ఇంటిలోకి వెళ్ళగానే పొయ్యిమీద అన్నం పెట్టి మాడుచున్న జొన్న అన్నం క్రిందికి దించాను. ఇక నా ఉత్సాహం అన్నది ఆగలేకపోయింది. పొలం దగ్గర ఎవ్వరూ లేరు. జీతగాండ్లను పొలం దగ్గరకు పంపి ఊరేగింపులో పాల్గొనాలను కొన్నాను. జీతగాండ్ల కొరకు హరిజనవాడ వెళ్ళాను. ఈ వాడకు చివర వున్న చెప్పులు కుట్టే ముత్తిగాడింటి ముందుకు వెళ్ళి జీతగాండ్ల కొరకు కేకలు వేశాను. కానీ జవాబు రాలేదు. ముత్తిగాడింటి ముందు చెప్పులు కుట్టే సామాను, చర్మాలు అన్ని చిందరవందరగా పడివున్నాయి. చెప్పులు కుట్టుకొంటూ విడిచి ఊరేగింపులో పాల్గొన్నట్టు తెలుసుకొని జీతగాండ్లు కూడా ఊరేగింపులో పాల్గొన్నారేమో నా పొలం ఏమవుతుందోనని భయంవేసి వాడలో ప్రతి ఇంటిలో చూచాను. ఎవ్వరూ లేరు. చిప్పలు, కుండలు మొదలగునవి మాత్రమే వున్నవి. రోటిలో సజ్జలు పోసి దంచుతూ రోకలి పడవేసి వెళ్ళిపోయారు. ఇంతలో కొమరయ్య పేరు మీద పాటలు పాడుతూ నినాదాలు ఇచ్చుట వినబడినది. ఇక ఆగలేకపోయాను. ఆంధ్ర మహాసభ ఆఫీసుకి వస్తూ ఉండగా గ్రామాధికారి ఎదురయ్యాడు. గ్రామ ప్రజలు మొత్తం అక్కడ వుంటే మీరు ఎక్కడికి వెళ్ళిపోతున్నారేమిటి అని అడిగాను.

"నేను అక్కడ ఉంటానికి వీలులేదు."

"ఏం ఎందుకు? నేనయినా పోవచ్చునా?"

"నిస్సందేహంగా వెళ్ళవచ్చును."

"మీరెందుకు రాకూడదు? ఏం కారణం చెప్పకూడదా?"

"చెప్పేదేముంది. నేను ప్రభుత్వ బానిసను. ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు. అక్కడ వుంటే రిపోర్టు రాయవలసి వస్తుంది. కొమరయ్య ప్రాణత్యాగాన్ని గుర్తించాను. రిపోర్టు చెయ్యడానికి చెయ్యి వణుకుచున్నది. నా కలం ఆడదు. ఊరేగింపులో ఉంటే తప్పక రిపోర్టు రాయాలి. లేకుంటే పై అధికారులతో బూతులు పడాలి. వీటన్నింటికంటే ఇవాళ గ్రామంలో నుంచి వేరే గ్రామం వెళ్ళటం ఉత్తమమని నిశ్చయించుకొని వెళ్ళిపోవుచున్నాను" అని వెళ్ళి పోయాడు.

నేను వెంటనే ఆంధ్ర మహాసభ ఆఫీసుకు వెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నాను. ఆంధ్ర మహాసభ ఏమిటి? కమ్యూనిస్టు పార్టీ జెండాలు పట్టుకొన్నారు. ఏమి సంగతి? ఆంధ్రమహాసభ జండా ఇంతవరకు నియమించలేదు? ఆంధ్ర మహాసభ నాయకత్వాన, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఈ ఊరేగింపు జరుగుతున్నదని తెలుసుకొన్నాను. ఇంతలో వీరుడైన 'కొమరయ్య గారికి జై' అని నినాదాలిచ్చారు. మొత్తం ప్రజలను చూడాలనుకొన్నానుగాని చూపు అందటం లేదు. దగ్గరలో వున్న చెట్టు ఎక్కి పైన నిలబడ్డాను. నెత్తి మీద ఏదో రెపరెపమని చప్పుడయింది. పైకి చూచేవరకు చెట్టుపైన కమ్యూనిస్టు పార్టీ జండా రెపరెపలాడుతోంది. కమ్యూనిస్టు పార్టీకి

జై అని నినాదాలిచ్చుకొంటూ 'మీజాన్' పత్రికలో వ్రాసిన కొమరయ్య పాట పాడుకొంటూ ఊరేగింపు బయలుదేరింది.

బురద కాళ్ళతో వుండి వంటి మీద చొక్కా లేకుండా అతి ఉత్సాహంతో ఎర్రజండాలు పట్టుకొని నినాదాలు ఇచ్చుచున్న రైతులు కనబడినారు. తలలు ఊపుకొంటూ మంచుల్లో వణుక్కొంటూ ఊరేగింపులో పాల్గొన్న తొంబై ఏండ్ల వృద్ధస్త్రీలు కూడా కనిపించారు. హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలు ఊరేగింపులో పాల్గొనిన వారిందరిని చెట్టెక్కి చూడగలిగాను. ఇక చెట్టు మీద ఉండలేకపోయాను. వెంటనే వచ్చి ఊరేగింపులో పాల్గొన్నాను. కొమరయ్య పాట చదువుచుండగా నీరైనట్టు అయింది. ప్రజలందరికీ కండ్లలో నీళ్ళు కమ్మిన ఈ పాట ముగియగానే ప్రజలందరు రౌద్రులయ్యి 'కొమరయ్యకు జై! ప్రజారాజ్యం కావాలి! పోలీసుల దౌర్జన్యాలు నశించాలి! స్వతంత్ర భారత్‌కీ జై! కమ్యూనిస్టు పార్టీకి జై' అని ఊరేగింపు ముగించి ఎవ్వరి ఇండ్లకు వారు కొమరయ్య సంగతి మాట్లాడుకొంటూ వెళ్ళి ఇండ్లపై ఎర్రజండాలు స్థాపించుకొన్నారు. ఒక కొమరయ్య పోగానే ఇంతమంది కొమరయ్యలు సిద్ధమయ్యారు అని, తప్పక మన కోర్కెలు నెరవేరుతవని దృఢమైనది. నేను నా యింటిపై ఎర్రజెండాను స్థాపించాను. ఆ ఎర్రకాంతి మొత్తం మా బజారులో వెలిగింది. అందరు కూడి కొమరయ్య ఏ ఆశయం కొరకు ప్రాణత్యాగం చేశాడో ఆ ఆశయం కోసం కంకణం కట్టుకొని ప్రతిజ్ఞ చేశారు.

*11 ఆగస్టు 1948, మీజాన్ దినపత్రిక*

*

*1946 జూలై 4న కడివెండి గ్రామంలో ప్రజా సమూహంపై విస్నూరు దేశముఖ్ గుండాలు మిష్కిన్ అలి నాయకత్వాన జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమరయ్య మరణించాడు. ఆ తర్వాత కొంతకాలానికే గెరిల్లా పోరాటం ప్రారంభమయింది. కొమరయ్య మరణం తెలంగాణా పోరాటం మొత్తాన్ని ఒక మలుపు తిప్పింది.*

*ఆ అమరవీరునికి శ్రద్ధాంజలి ఘటించేందుకు 1946 జూలై 26న 'కడివెండి దినం' జరపవలసిందిగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఆ పిలుపు ననుసరించి తెలంగాణాలోని ప్రతి పల్లె కదిలింది; ప్రతి ఊరు ఏరులాగ పొంగింది. ఆనాడు ఎక్కడ చూసినా సభలు, ఊరేగింపులు. కొమరయ్య ఏ ఆశయ సాధనలో బలి అయ్యాడో ఆ ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామని ఆనాడు యావత్ తెలంగాణా ప్రజానీకం ప్రతిజ్ఞ తీసుకొన్నారు. అనేక ఆంక్షలు, నిషేధాలు విధించి, 'కడివెండి దినాన్ని' జరగనీయకుండా విఫల ప్రయత్నం చేశాడు నిజాం.*

*అనాడు వెల్లివిరిసిన ప్రజా చైతన్యాన్ని రికార్డు చేసింది కథ.*

*అడివి బాపిరాజు సంపాదకత్వంలో హైదరాబాద్ నుండి వెలువడే 'మీజాన్' దినపత్రిక, జూలై 25 నాడు ప్రత్యేక సంచిక ప్రచురించింది. ఆ సంచిక కొమరయ్య ఫోటో, దాని క్రింద 'వెలిగింది వెలిగింది ఒక అమరజ్యోతి' అనే గేయాన్ని ప్రచురించింది. తన సంపాదకీయంలో వ్యంగ్య ధోరణిలో నిజాంను విమర్శించింది.*